# నమస్తే తెలంగాణ
## ములుగు
## జయశంకర్ భూపాలపల్లి

10 | వరంగల్, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




సుక్యాతండాలో క్రేన్ సహాయంతో వ్యవసాయ బావిలో పూడిక తీస్తున్న కార్మికులు



- ఆరు నెలలుగా మిషన్ భగీరథ పైప్ లైన్లకు లీకేజీలు
- అధికారులకు మొరపెట్టుకున్నా చేపట్టని మరమ్మతులు
- నీరు రాక అలంకారప్రాయంగా నల్లాలు
- వ్యవసాయ బావుల్లోనూ కానరాని జలాలు
- పంటలు కాపాడుకునేందుకూ రైతుల పాట్లు.. పూడికతీత పనులు మొదలు
- కేసీఆర్‌ను వద్దనుకొని తప్పు చేశామంటున్న గిరిజనులు

# నీళ్ల కోసం తండ్లాట

## తాగు, సాగు నీరులేక సుక్యాతండా వాసుల గగ్గోలు

రాయపర్తి, ఫిబ్రవరి 20 : నిత్యం ఎస్సారెస్పీ, కాళేశ్వరం జలాలు సవ్వడి చేయగా.. పచ్చని పంటలతో కోనసీమను తలపించిన ఆ తండా ప్రస్తుతం చుక్క నీటి కోసం తండ్లాడుతున్నది. పదేండ్ల పాటు సాగు, తాగు నీటికి డోకా లేకుండా బతికిన గిరిజనులు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తమకు నీటి కష్టాలు దాపురించాయంటూ మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని జయరాం తండా (ఎస్) పరిధి సుక్యాతండావాసులు ఆరు నెలలుగా సాగు, తాగు నీళ్లు లేక అల్లాడుతున్నారు. కేసీఆర్ హయాంలో పదేండ్ల పాటు తండాలోని బీడు భూములన్నీ ఎస్సారెస్పీ, కాళేశ్వర జలాలతో పచ్చని పంట పొలాలుగా మారాయని ప్రజలు చెబుతున్నారు. మిషన్ భగీరథతో తాము తాగు నీటి కోసం వ్యవసాయబావుల వద్దకు వెళ్లిన రోజులు మరచిపోయామంటున్నారు. అయితే రేవంత్‌రెడ్డి పాలన మొదలైనప్పటి నుంచి అనేక ఇబ్బందులతో కాలం గడుపుతున్నామని వాపోతున్నారు. ఆరు నెలలుగా మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి తాగు నీరంతా వృథాగా పోతున్నదని, మరమ్మతు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో మిషన్ భగీరథ నీరు రాక ఇండ్ల ముందున్న నల్లాలు అలంకారప్రాయంగా మారాయన్నారు. గుక్కెడు నీళ్ల కోసం మళ్లీ ఆడబిడ్డలంతా వ్యవసాయ బావుల వద్దకు బిందెలతో వెళ్లాల్సి వస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బావులు సైతం అడుగంటాయని, పదేండ్ల తర్వాత క్రేన్లతో పూడికతీస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సాగు, తాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

### నల్లా నీళ్లు బందైనయ్..



కేసీఆర్ సారు సల్లంగుండా.. ఆయన ఉన్నన్నాళ్లు మాకు నీళ్లకు ఏ గోస లేకుండె.. సారూ గిట్ల కుర్సీ దిగిపోయిండో లేదో మళ్ల మా బతుకుల్ల మన్నుబడ్డట్టు అయింది. ఆర్నెళ్ల సంది ఇంటి ముందున్న నల్లాల నుంచి సుక్క నీరు వత్తలేదు. ఎవరిని అడిగినా ఏం చెప్తలేరు. మేమేమో చాతగాని ముసలోల్లం. బాయిల కాడ నుంచి తెచ్చుకుందామంటే పంటలకే నీళ్లు సరిపోతలేవని ఎవరూ రానిస్తలేరు. ఈ నాలుగేండ్లు ఎట్ల బతుకుడో అర్థమైతలేదు. బంగారం లాంటి కేసీఆర్ సారును వదులుకొని పెద్ద తప్పు చేసినమని చెంపలేసుకుంటున్నం.

– గుగులోత్ కోట్యానాయక్

### బాయి పూడిక తీయిస్తున్న..



కేసీఆర్ ప్రభుత్వం ఉన్న కాలంల నా వ్యవసాయ బాయి ఎప్పుడూ నిండుగా ఉండేది. ఇప్పుడు కాల్వల నీళ్లు రాకపోవడంతో బాయిల పైర్లకు సరిపడా నీరు ఊరుతలేదు. దీంతో రూ. 25 వేలు పెట్టి నల్గొండ జిల్లా నుంచి క్రేన్, కార్మికులను తీసుకొచ్చి పూడిక మట్టి తీయిస్తున్న. కాంగ్రెస్ సర్కార్ కోసం ఎంత తండ్లాడినమో.. ఇప్పుడు అంత కంటే ఎక్కువనే కష్టాలు అనుభవిస్తున్నం.

– గుగులోత్ బక్కులునాయక్

### పంట ఎండుతుంటే పాణం తండ్లాడుతున్నది



నాకున్న ఎకరంనర వ్యవసాయ భూమిలో ఈ కాంగ్రెస్ సర్కార్ పనితీరు చూసి వరి పంట కు బదులు మక్క జొన్న సాగు చేసిన. ఇప్పుడున్న పరిస్థితుల్లో మక్కజొన్న చేనుకు కూడా సరిపడా నీళ్లు బాయిల ఎల్లుత లేవు. చేను ఇప్పుడిప్పుడే కంకులు పెడుతున్నది. నీళ్లు లేక పొట్టకొచ్చిన చేను కండ్ల ముందే ఎండిపోతుంటే పాణం తండ్లాడుతున్నది.

– గుగులోత్ రాములు

### పదేండ్ల తర్వాత పని దొరికింది



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామం మాది. మా కుటుంబాలన్నీ ఎనుకటి నుంచి వ్యవసాయ బావులు తవ్వుడు, పూడికలు తీసుకుంటనే బతుకుతున్నయి. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక మా క్రేన్‌లు, పనులు అన్నీ మూలనపడ్డయి. మళ్లా ఇప్పుడిప్పుడే క్రేన్‌లకు గిరాకీ మొదలైంది. బాయిల పూడిక తీసినా నీళ్లు ఊరే పరిస్థితి కన్పిస్తలేదు.

– శివరాత్రి భాగ్యమ్మ, క్రేన్ కార్మికురాలు, సిరిపురం, యాదాద్రి భువనగిరి

# నేనొచ్చా.. ఇక మీ పనిపడతా..!





నెక్కొండ మండలం పెద్దకోర్పోలులో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇటు గ్రామ ప్రజలను, పంట చేన్లకు నష్టం చేస్తుండడంతో సూరం జగన్ అనే రైతు రూ. 6వేలకు ఓ కొండెంగను కొని గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఇక అప్పటినుంచి ఆ కొండెంగను ఇలా బైక్ చేన్ల వద్దకు, ఊళ్లో తిప్పుతుండడంతో దానిని చూసి కోతులు పరారవుతున్నాయి.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

పెద్దకోర్పోలులో కోతుల గుంపు, (ఇన్‌సెట్) బైక్‌పై కొండెంగ



నాడు జలకళ

ఆనకట్టపై నుంచి జాలువారుతున్న ఆకేరు జలాలు(ఫైల్)



నేడు వెలవెల



ఇసుకను తరలించడంతో గుంతలుగా ఏర్పడిన ఆనకట్ట ఎగువభాగం, (ఇన్‌సెట్) నీటి ప్రవాహం లేక వెలవెలబోతున్న ఆకేరు

- అడుగంటిన ఆకేరు వాగు
- సాగునీరందక రైతుల అరిగోస

పదేళ్లుగా మండువేసవిలోనూ మత్తళ్లు దూకుతూ జలసవ్వడి చేసే ఆకేరు వాగు నేడు వెలవెలబోతున్నది. చుక్క నీరు కూడా లేకపోవడంతో పరివాహక గ్రామాల రైతులు పంటలను కాపాడుకునేందుకు అరిగోస పడాల్సి వస్తున్నది. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని పగిడిపల్లి, చిన్నగూడూరు, ఉగ్గంపల్లి, జయ్యారం, విస్సంపల్లి, మన్నెగూడెం తదితర సరిహద్దు గ్రామాల గుండా ప్రవహించే ఆకేరు ఆ ప్రాంత సాగు, తాగునీటికి జీవనాధారం. గత కేసీఆర్ సర్కారు హయాంలో కాళేశ్వర జలాలతో చెరువులు, కుంటలు నిండి వాటి అలుగు ఆకేరులో కలిసి వేసవిలోనూ ప్రవహిస్తుండేది. ఫలితంగా రైతులకు రెండు పంటలకు రంది లేకుండా సాగునీరందింది. ప్రస్తుతం ఎప్పుడూ లేని విధంగా ఇలా వాగు ఎండిపోయి కళ తప్పింది. అలగే ఇసుక అక్రమ తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. - చిన్నగూడూరు, ఫిబ్రవరి 20

# పథకం ప్రకారమే హత్య

- కోర్టు విచారణకు ముందురోజే ఘటన
- కేసును వచ్చే నెల 21కి వాయిదా వేసిన కోర్టు
- భూమి కోసమే రాజలింగమూర్తిని హత్యచేశారని మృతుడి భార్య ఫిర్యాదు
- పోలీసుల అదుపులో ఇద్దరు ?
- కేసును డైవర్ట్ చేసేందుకు కుట్రలు



రాజలింగమూర్తి మృతికి కారణంగా భావిస్తున్న వివాదాస్పద భూమి ఇదే



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ భర్త రాజలింగమూర్తి హత్య భూ వివాదం నేపథ్యంలో పథకం ప్రకారం జరిగినట్లుగా స్పష్టమవుతున్నది. జిల్లా కేంద్రంలోని సుమారు రూ. 3 కోట్ల విలువైన భూమిపై రాజలింగమూర్తి స్టే తెచ్చుకోగా గురువారం భూపాలపల్లి సబ్ కోర్టులో విచారణ ఉండగా ముందురోజే దారుణ హత్యకు గురయ్యాడు. దీంతో కేసు విచారణను కోర్టు వచ్చే నెల 21కి వాయిదా వేసింది. మృతుడి భార్య సైతం భూమి కోసమే తన భర్తను హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

**కొంపముంచిన భూవివాదం**

జిల్లా కేంద్రంలోని 319–బీ, 323 సర్వే నంబర్లలోని 2.25 ఎకరాల భూమికి సంబంధించి మాజీ సర్పంచ్ బుర్ర చంద్రయ్య, రేణుకుంట్ల కుటుంబ సభ్యుల మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తున్నది. ఈ భూమిలో ఎకరం స్థలం రోడ్డు కింద పోవడంతో అది తమకు కాదంటే తమది కాదని, ఉన్న భూమిపై గొడవలు పెట్టుకుంటూ పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో నాగవెల్లి రాజలింగమూర్తి అడ్వకేట్ గంట సంజీవరెడ్డితో కలిసి సెటిల్‌మెంట్ చేస్తానని, కోర్టులో తాము చూసుకుంటామని రేణుకుంట్ల చంద్రయ్య, రేణుకుంట్ల కొమురయ్య, రేణుకుంట్ల లక్ష్మి నుంచి సర్వే నంబర్ 319–బీలోని ఆరు గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం లభించకపోవడం, అడ్వకేట్ సంజీవరెడ్డి మృతి చెందడంతో రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని తమకు తిరిగి ఇవ్వాలని రేణుకుంట్ల కుటుంబ సభ్యులు రాజలింగమూర్తితో గొడవపడుతూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఇదే అదనుగా రాజలింగమూర్తి కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నాడు. ఈ విషయమై గురువారం భూపాలపల్లి కోర్టులో విచారణ జరగనుండగా, పథకం ప్రకారం ముందు రోజే హత్య చేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

**పోలీసుల అదుపులో ఇద్దరు?**

రాజలింగమూర్తి హత్య కేసులో రేణుకుంట్ల కుటుంబానికి చెందిన ఇద్దరిని పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్య జరిగిన స్థలంలో గురువారం క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఘటనా స్థలం వద్ద సంచిలో ఉన్న కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మిగిలిన వారి కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. అదుపులో ఉన్న వారి నుంచి సమాచారం సేకరించిన పోలీసులు కాల్‌డేటాతో విచారణ ముమ్మరం చేశారు.

### కేసుపై రాజకీయం

భూ వివాదంలోనే రాజలింగమూర్తి హత్య జరిగిందని అతడి భార్య చెప్తున్నా కొందరు కావాలనే ఈ ఘటనను డైవర్ట్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన కేసును అడ్డం పెట్టుకుని అడ్డగోలు వాదనలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడుతున్నారు. రాజలింగమూర్తి పలు భూ వివాదాలతో పాటు అటవీశాఖ డిప్యూటీ ఆర్వో మాధవరెడ్డి, తహసీల్దార్ చక్రధర్, వీఆర్వో జాకీర్ హుస్సేన్‌ను ఏసీబీకి పట్టించాడు. ఓపెన్‌కాస్టు గనులతో పర్యావరణం దెబ్బతింటున్నదని సింగరేణిపై గ్రీన్ ట్రిబ్యునల్‌లో రిట్ వేశాడు. చెరువు శిఖం భూ ఆక్రమణలపై కేసులు వేశాడు. పలు ఘటనల్లో రాజలింగమూర్తిపై 12 కేసులు నమోదయ్యాయి. కేవలం బీఆర్‌ఎస్ పార్టీని బదనాం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారనే అభిప్రాయాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

### భూమి కోసమే హత్య చేశారు

**పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి భార్య సరళ**

భూపాలపల్లిలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న తమ భూమిని దక్కించుకునేందుకు రేణుకుంట్ల కుటుంబ సభ్యులు తన భర్త రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య సరళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ భూమి విషయమై రేణుకుంట్ల కొమురయ్య, రేణుకుంట్ల సంజీవ్ కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయని, దౌర్జన్యంగా తమ భూమిని కాజేసేందుకు యత్నిస్తుండగా తాము సివిల్ కోర్టుకు వెళ్లామని, తమకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉందని భావించి హత్య చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తను చంపితే ఎవరూ అడ్డుండరని, భూమిని దక్కించుకోవచ్చని ఈ దారుణానికి ఒడిగట్టారని , రేణుకుంట్ల సంజీవ్ (భూపాలపల్లి), పింగిళి శ్రీమంత్ అలియాస్ బబ్లూ (పెద్దతూండ్ల), మోరె కుమార్ (కొంపెల్లి), కొత్తూరి కుమార్ (భూపాలపల్లి) రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి కత్తులు, గొడ్డళ్లతో హత్య చేశారని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సరళ పోలీసులను కోరింది. కాగా, సరళ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ నరేశ్ తెలిపారు.



నర్సింహులపేటలో యూరియాకోసం బారులు తీరిన రైతులు

# పోలీసు పహారాలో..

- నర్సింహుల పేటలో యూరియా పంపిణీ
- ఒక్కొక్కరికి నాలుగు బస్తాలు అందజేత
- రైతులకు రోజూ తప్పని తిప్పలు

నర్సింహులపేట, ఫిబ్రవరి 20: తెలంగాణ రాష్ట్రం రాక ముందు యూరియా బస్తా కోసం రైతులు పడిన కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు యూరియా బస్తాలు, విత్తనాల కోసం పోలీసు లాఠీలు దెబ్బతిన్న రైతన్నలకు మళ్లీ క్యూలో నిలబెట్టి కూపన్లు ఇచ్చే పరిస్థితి వచ్చింది.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో యూరియా బస్తాలు దొరకకపోవడంతో రైతులు 10 రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రానికి యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున చేరుకొని బారులు తీరారు. రైతులను క్యూలో నిల్చోబెట్టి పోలీసులే కూపన్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూలో నిలబడేందుకు ఇబ్బంది పడిన వృద్ధులు కింద కూర్చుండి పోయారు. పీఏసీఎస్‌కు 444 యూరియా బస్తాలు రాగా, రైతుకు నాలుగు బస్తాలు ఇచ్చారు. నాలుగు ఎకరాలకు పైన వరి, మక్కజొన్న సాగు చేసిన రైతులకు 4 బస్తాల యూరియా సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇంత కష్టం 10 ఏళ్లుగా చూడలేదు



యాసంగి 4 ఎకరాలు వరినాటు పెట్టిన. యూరియా బస్తాల కోసం నాలుగు రోజులుగా తిరుగుతున్న. ఎప్పుడు చూసినా బస్తాలు తక్కువ వచ్చాయని చెబుతున్నారు. నిన్న బుధవారం వచ్చిన. చాలా మంది లైన్ల నిలబడి ఉన్నారు. రెండు బస్తాలు ఇచ్చినారు. మల్ల ఇవాల వచ్చి లైన్లో నిలబడితే పోలీసోళ్లు చిట్టి ఇచ్చిర్రు. చాల ఏళ్ల సంది వ్యవసాయ చేస్తున్న. 10 ఏళ్లలో ఇలాంటి ఇబ్బంది రాలేదు.

– గుండమల్ల వీరస్వామి, బొజ్జన్నపేట, నర్సింహులపేట

### కేయూ దూరవిద్య పీజీ పరీక్షలు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 20: కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పీజీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆర్ట్స్ కాలేజీ పరీక్షా కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డాక్టర్ పద్మజ, దూరవిద్య కేంద్రం సంచాలకుడు ప్రొఫెసర్ సురేశ్‌లాల్, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ రమేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కాగా, లాల్‌బహదూర్ కాలేజీలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ఒకరు డిబార్ అయినట్లు తెలిపారు. నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.



# సురేఖ వర్సెస్ రేవూరి

- కాంగ్రెస్‌లో మళ్లీ బయటపడ్డ వర్గపోరు
- మంత్రి వర్గీయులంటూ ఆర్జీపీఆర్‌ఎస్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు
- ఇతర రాష్ట్రాల ప్రతినిధుల ఆగ్రహం

గీసుగొండ, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీలో మళ్లీ వర్గపోరు బయటపడింది. మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మధ్య విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. దీంతో పార్టీ కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితి తలెత్తింది. కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా దేశవ్యాప్తంగా ఉన్న రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లాస్థాయి శిక్షణా సమావేశం గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాలలో నిర్వహించేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు కునాల్ బె నర్జీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వచ్చారు. సమావేశానికి కొద్ది నిమిషాల ముందే పోలీసులు వచ్చి అనుమతి లేదంటూ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో అక్క డే ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆశ్చర్యానికి గురయ్యాయి. ఇది పార్టీ సమావేశం కాదని గ్రామీణ స్థాయిలో స్వయంపాలన, ప్రజల భాగస్వామ్యం, గాంధేయవాదంపై శిక్షణ లో వివరిస్తారని ఆర్జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రడం భరత్ చెప్పినా పోలీసులు వినకపోవడంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. సొంత పార్టీ నాయకులే సమావేశాలను అడ్డుకోవడం ఏమిటని, అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యే పోలీసులతో చెప్పించడంపై జాతీయ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షుల సూచన మేరకు హనుమకొండ జిల్లా పార్టీ ఆఫీసులో నిర్వహించేందుకు ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. జిల్లాస్థాయి సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎవరూ వెళ్లవద్దని అధికార పార్టీ ఎమ్మె ల్యే ప్రకాశ్‌రెడ్డి హుకుం జారీ చేయడంతో పాటు ఎవరైనా సమావేశానికి వెళితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని బెదిరించినట్లు ఆర్జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రడం భరత్ ఆరోపించారు. తాము కొండా వర్గీయులమని, తమపై కక్ష కట్టి పార్టీ కోసం పనిచేస్తున్న తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. ఆర్జీపీఆర్‌ఎస్ విభాగంపై ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి ఆవగాహన లేక వర్గ విభేదాలు సృష్టిస్తూ సమావేశానికి ఎవరు రాకుండా అడ్డుకున్నాడన్నారు.



సమావేశానికి పోలీసులు అనుమతించకపోవడంతో బయట కూర్చున్న కార్యకర్తలు

# స్ప్రింగ్ స్ప్రీకి వేళాయె..

- నిట్‌లో మూడు రోజుల పాటు మహోత్సవం
- హాజరుకానున్న పద్మశ్రీ బ్రహ్మానందం



ఉత్సవాలకు పద్మశ్రీ బ్రహ్మానందంను ఆహ్వానిస్తున్న స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసచార్య

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 20 : వరంగల్ నిట్ ప్రతిష్ఠాత్మక వార్షిక సాంస్కృతిక మహోత్సవం స్ప్రింగ్ స్ప్రీ–2025కు ముస్తాబవుతోంది. ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సంగీతం, నృత్యం, కళలు, వినోదం వంటి రంగాల్లో ప్రతిభను వెలికితీసేందుకు స్ప్రింగ్ స్ప్రీ దక్షిణ భారత దేశంలోని ప్రముఖ కళాశాలల వార్షికోత్సవాల్లో ఒకటిగా పేరుగాంచింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, కళాకారులు, ప్రదర్శకులు పెద్దఎత్తున ఈ మహోత్సవానికి హాజరవుతారు. పోటీలు, వర్క్‌షాపులు, ప్రో షోలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేయనున్నాయి. అనేక కార్యక్రమాలతో యువతలోని ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీసే వేడుకలో మరింత ఉత్సాహాన్ని పంచేందుకు పద్మశ్రీ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తన అమోఘమైన హాస్యంతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్న సినీనటుడు, కమెడియన్ బ్రహ్మానందం స్ప్రింగ్ స్ప్రీ వేదికపై సందడి చేయనున్నారు.




విద్యుత్ వెలుగుల్లో వరంగల్ నిట్